క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి వెండి వస్తువుల విరాళం



పత్తికొండలో అయ్యప్పస్వామి వెండి వస్తువులు బహూకరించేందుకు వెళ్తున్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని తేరుబజారులో కొలువైన అయ్యప్పస్వామి ఆలయానికి స్థానిక అయ్యప్ప భక్తులు శ్రీనివాసరెడ్డి, శాంతమ్మ దంపతులు వెండి వస్తువులను బహుకరించారు. రూ.1.10లక్షలతో కేజీ వెండితో దీపాలు, నైవేద్యం ప్లేటు తయారుచేయించి బుధవారం ఆలయానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ దేవర



మారెమ్మవ్వకు పూజలు చేసిన దృశ్యం

ఆలూరు రూరల్: పట్టణంలోని ఎస్సీ కాలనీలో కొలువైన మారెమ్మవ్వ దేవరను కాలనీ వాసులు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఇంటింటి నుంచి తెచ్చిన బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మూడేళ్లకొకసారి నిర్వహించే కార్యక్రమం కావడంతో బంధువులు, స్నేహితులతో లోగిళ్లు కళకళలాడాయి.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి



పచ్చారపల్లి గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్ర

హాలహర్వి: గ్రామాల్లోని ప్రజలు గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ చంద్ర సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై ప్రజలకు తెలియజేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ఆలూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం యూజర్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి,ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, మండల నాయకుడు షాకీర్ అన్నారు. బుధవారం కరెంటు చార్జీలు తగ్గించాలంటూ ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ.. అధికారం చేపట్టక ముందు విద్యుత్ చార్జీల పెంచబోమని చెప్పిన కూటమి నేతలు అదనపు చార్జీల పేరుతో చార్జీలు పెంచడం దారుణమన్నారు. దీంతో పేద మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడిందన్నారు.నాయకులు కృష్ణ, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.

కైరుప్పలలో కాలనీలు ఇలా..



కైరుప్పల బీసీ కాలనీలో ఆగిన మురుగు నీరు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసి డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు వెళ్లే దారి లేక కాలనీల్లోనే నిలిచి దోమలకు ఆవాసాలుగా మారి వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొంటున్నారు. సమస్యలను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా ఇబ్బందులు తప్పించాలని కోరుతున్నారు.

గణేకల్‌లో బంగారమ్మవ్వ ఉత్సవాలు

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో బుధవారం బంగారమ్మవ్వ దేవర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవమ్మవ్వ, లక్ష్మమ్మవ్వ, సుంకులమ్మవ్వ, బంగారమ్మవ్వ ఆలయాలకు భక్తులు కలశాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవార్లకు కుంభాల్లో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవర మహోత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.





బొమ్మిరెడ్డిపల్లెలో వ్యాక్యాన్ని బోధిస్తున్న పాస్టర్ ఇమ్మానియేలు, ఏబీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు





చింతకుంటలో దైవ సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్‌లు, హాలహర్విలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



తుగ్గలి సీయోను చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు,



ఎస్‌హెచ్ ఎర్రగుడి చర్చిలో పాస్టర్ షేక్ చాందుబాషాను సన్మానిస్తున్న దృశ్యం

మద్దికెర : మండలంలోని మద్దికెర, పెరవలి, బసినేపల్లి తదితర గ్రామాలలో బుధవారం క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని క్రైస్తవులు ప్రార్థనా మందిరాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. అర్ధరాత్రి క్రీస్తు జన్మదిన సందర్భంగా కేకు కట్ చేశారు. అనంతరం మేరీ మాత, బాలయేసును ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేపట్టారు. చర్చిలో చిన్నారులు వేసిన నృత్యాలు, ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే వేసిన సెట్టింగ్ అలరించాయి.

ఆలూరు: క్రీస్తునామం క్రైస్తవులకు అనుసరనీయమమని క్రిస్మస్ పండుగ సందర్భంగా సీఎస్ఐ, ఆర్సీఎం, హోరేబు,హోసన్న మందిరాల్లో పాస్టర్లు క్రైస్తవులకు బోధించారు. బుధవారం క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కర్నూల్ -బళ్ళారి రోడ్డులోనున్న సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవ డానియేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనులు చేశారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చీలలో ప్రార్థనలు చేశారు. ఆటల పోటీలలో గెలుపొందిన బాల, బాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

పత్తికొండ/తుగ్గలి : పత్తికొండలో బుధవారం క్రిస్మస్ సంబరాలు వైభవంగా జరిగాయి. జీసస్ అవనిపై అవతరించిన సందర్భంగా క్రైస్తవులు వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిలు ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తు స్తుతి గీతాలతో మార్మోగాయి. ఎస్సీ కాలనీలోని సీఎస్ఐ చర్చి, ఆదోని రోడ్డులో ఉన్న చర్చితో పాటు పట్టణ, ఆయా గ్రామాల్లో చర్చిలకు భక్తులు పోటెత్తారు. మత పెద్దలు క్రీస్తు బోధనలను వివరించారు. క్రిస్మస్ కేక్‌లు కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. శాంతాక్లాజ్ వేషధారణలో పలువురు చర్చిల వద్ద అలరించారు.

తుగ్గలిలో..

మండలంలో బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. క్రిస్టియన్లు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రేమ, క్షమ క్రీస్తు సందేశమని, అలాంటి క్రీస్తు బోధనలతో మానవుడు సన్మార్గంలో నడవాలని పాస్టర్లు సందేశమిచ్చారు. క్రీస్తు జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా బుధవారం చర్చిల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసు బోధించిన ప్రేమ మార్గంలో పయనించి జీవితానికి సార్థకత చేకూర్చుకోవాలని పాస్టర్లు సందేశమిచ్చారు.

ఆలూరు రూరల్: కరుణామయుని రాకతో యావత్ ప్రపంచం పులకించడంతో ఆ ఆనందోత్సాహాలతో క్రైస్తువులు క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. బుధవారం పట్టణంలోని కోయనగర్ కాలనీకి చెందిన క్రైస్తవులు తేజోమయునికి స్వాగతం పలుకుతూ పశువుల పాకను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేపట్టారు.పాపాలను పరిహరించు ప్రభువా అంటూ వేడుకున్నారు. క్రీస్తు జన్మించిన పశువుల పాకను 10 రోజుల పాటు ఉంచుతామని కాలనీ వాసులు తెలిపారు.

హొళగుంద: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక పెనుయేలు, షిలోయ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఏసు చూపిన సన్మార్గంలో నడవాలని భక్తులకు సందేశమిచ్చారు.

హాలహర్వి: మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ పాల్‌బెనహర్ వాక్యోపదేశం చేశారు. చింతకుంట గ్రామంలో న్యూలైఫ్ చర్చ్ దైవజైనులు ఠాగూర్ మాట్లాడుతూ సాటి మనవుల పట్ల ప్రేమ, కరుణ, దయ చూపాలని, ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇచ్చిన ఏసు మార్గంలో నడవాలని సూచించారు. సర్పంచ్ సద్దాం హుసేన్, మాజీ పంచాయతీ కార్యదర్శి నారాయణప్ప, మాజీ సర్పంచ్ రాముడు, సీనియర్ నాయకులు ఉమాకాంతస్వామి, జేమ్స్, పాలయ్య పాల్గొన్నారు.



కోయనగర్ కాలనీలో క్రైస్తవులు ఏర్పాటు చేసి ముస్తాబు చేసిన పశువుల పాక



విద్యుత్ దీపాలంకరణలో కారుమంచి చర్చి



ఏసు వృత్తాంతం తెలిపే విధంగా అలంకరణ



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

● కృష్ణగిరి: ఏసయ్య బోధనలు సర్వ మానవాళికి సన్మార్గంలో నడిపిస్తాని ఉమ్మడి హైకోర్టు రిటైర్డ్ అధికారి కృష్ణవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడిలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి చిలుకలూరి పేట నుంచి పాస్టర్ షేక్ చాందుబాషా ముఖ్య అతిథిగా పాల్గొని వాక్యాన్ని బోధించారు. అనంతరం రిటైర్డ్ అధికారి కృష్ణవర్ధన్‌రెడ్డి క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక పాస్టర్ నెతానేయులు, సంఘ పెద్దలు పెద్దన్న, చిన్న నాగన్న, బి.మాదన్న, లింగన్న, కేశన్న తదితరులు కృష్ణవర్ధన్‌రెడ్డి, షేక్ చాందుబాషా, మాజీ సర్పంచ్ సురేంద్రారెడ్డిని సన్మానించారు.





హొళగుంద పెనుయేలు ప్రార్థన మందిరంలో సందేశం ఇస్తున్న పాస్టరు, హాజరైన క్రైస్తవులు

రేపు విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట

తుగ్గలి : విద్యుత్ చార్జీల బాదుడుపై ఈనెల 27వ తేదీన పత్తికొండలో కూటమి సర్కార్‌పై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం చేపట్టబోతున్నట్లు ఆ పార్టీ ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, తుగ్గలి మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచి వినియోగదారులపై భారం వేసిందన్నారు. ఎన్నికల సభల్లో సీఎం జగన్ విద్యుత్ చార్జీలు పెంచినట్లుగా చంద్రబాబు ప్రచారం చేయడంతో పాటు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చార్జీలు తగ్గిస్తామని పదేపదే చెప్పారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే సామాన్యులపై రూ.15వేల కోట్లకు పైగా భారం మోపడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి సర్కార్ విఫలమైందన్నారు. ప్రజలకు ఇస్తామన్న సూపర్ సిక్స్ హామీల ఊసేలేదని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టబోయే నిరసన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోరుబాటను విజయవంతం చేద్దాం

కృష్ణగిరి: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న పత్తికొండలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని బూటకపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని కోరుతూ పత్తికొండలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగే ర్యాలీకి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



దేవనకొండలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వాజ్‌పేయి జయంతి

దేవనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం మాజీ ప్రధానమంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయి శత జయంతిని నిర్వహించారు. గ్రామ సర్పంచ్, కూటమి నాయకుల ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మాజీ హెచ్ఎం ఉచ్చీరప్ప, మాజీ ఎంపీటీసీ ఆకుల వీరేష్, బీజేపీ మండలాధ్యక్షుడు బోడ రవికుమార్, మాజీ సైనికులు రామాంజనేయులు మాట్లాడారు.

హొళగుంద: దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి వందవ జయంతిని పురస్కరించుకుని బుధవారం హొళగుందలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏఈఎన్ ప్రసాద్, నేషనల్ కౌన్సిల్ మెంబరు చిదానంద మాట్లాడుతూ వాజ్‌పేయి పాలన సుభిక్షంగా సాగిందని, ఆయన హాయంలో దేశ ప్రజలందరికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. నాయకులు జాంటీ వీరేశ్, మహేశ్, ఉలిగన్న, శివరాజ్, దేవన్న పాల్గొన్నారు.

ఉరుసు ప్రారంభం

మద్దికెర : మండలంలోని బసినేపల్లి గ్రామంలో కాశింతాత ఉరుసులో భాగంగా బుధవారం గంధం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి గంధం పెట్టెను తలపై పెట్టుకొని గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు.

29న ఖాజా స్వామి ఉరుసు

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో ఈ నెల 28న గంధం, 29న ఖాజాస్వామి 54వ ఉరుసు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తిమ్మాపురం వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. గ్రామంతో పాటు మండలంలోని డేగులహాలు,బంటనహాలు,కాజీపురం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారని చెప్పారు.

మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన

తుగ్గలి : కంది పంట కోత యంత్రంపై ఉన్న జీ.ఎర్రగుడికి చెందిన గొర్రెల కాపరి ఆంజనేయులు (24) విద్యుత్ తీగలు తగిలి మంగళవారం మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు విషయమై బుధవారం కుటుంబ సభ్యులు జొన్నగిరిలో రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఎస్ఐ తీరును నిరసిస్తూ అరగంట పాటు రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమించేలా చేశారు.

మిత్రుల ఆర్థిక సాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): వారంతా వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదవ తరగతి చదువుకున్నారు. ఈ మధ్యనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొని ఎవరికి ఏ ఆపద వచ్చినా తెలియజేయాలని వాట్సప్ గ్రూప్ తయారు చేసుకున్నారు. ఐదు రోజుల క్రితం పట్టణానికి చెందిన సుధాకర్ గుండెపోటులో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాటి స్నేహితులు రూ.10వేలు పోగు చేసి బుధవారం కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు, పరమేష్‌యాదవ్, శ్యామల, భారతి, షేక్షావలి, కుమార్, పామయ్యయాదవ్,బషీర్ అహ్మద్ ఉన్నారు.

రైలు నుంచి పడిపోయిన విద్యార్థిని

● కాపాడిన రైల్వే పోలీసులు



డి.చెర్లోపల్లి-చిన్నేకుంటపల్లి గ్రామాల మధ్య రైలు పట్టాల పక్కన పడిన హరిత

బత్తలపల్లి: తిరుపతి - గుంతకల్లుకు ప్రయాణిస్తున్న రైలు నుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కిందపడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆమెను కాపాడారు. ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన వివరాల మేరకు... కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమార్తె బోయ హరిత అన్నమయ్య జిల్లా మదనపల్లి వద్ద ఉన్న కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. క్రిస్మస్ సెలవులు రావడంతో బుధవారం తన సోదరుడు గిరిబాబుతో కలసి స్వ గ్రామానికి వెళ్లడానికి గుంతకల్లు ప్యాసింజర్ రైలు ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న రైలు ముదిగుబ్బకు చేరగానే హరిత వాష్ రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చిన సోదరుడు రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. ఆమె వద్దనున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా బత్తలపల్లి మండలం చిన్నేకుంటపల్లి-డి.చెర్లోపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సెక్షన్‌లోని ఆన్ డ్యూటీ కీమెన్ మస్తాన్‌ను అప్రమత్తం చేయడంలో ఆయన అక్కడికు పరిశీలించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన హరితను 108 అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయినట్లు ప్రాథమిక విచారణ తేలింది. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి ఆమె బయటపడినట్లు ఆర్డీటీ వైద్యులు తెలిపారు.

● ప్రమాదకరంగా తిమ్మాపురం వంతెన



చిప్పగిరి: మండలంలోని తిమ్మపురం గ్రామ బ్రిడ్జికి ఒక వైపు రెయిలింగ్ లేక ప్రమాదకరంగా మారడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం లోకి పోవడానికి ఇదే ప్రదాన దారి కావడంతో రాకపోకలు సాగించే సమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా కాలువలో పడిపోయే ప్రమాదముంది. ముఖ్యంగా బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండటం, రహదారి వంతెనకు మరీ దగ్గరగా ఉండటంతో వాహనాలను తిప్పుకునే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక భారీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. గ్రామంలోకి వచ్చే రేషన్ బియ్యం, పాఠశాల బస్సులు,ఇతర భారీ వాహనాల డ్రైవర్లు అనేక అవస్థలు పడుతున్నారు. వంతెనను వెడల్పు చేసి, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సప్తాశ్వరూఢుడైన భానుడు చలి కారణంగా ఉదయించడానికి బద్ధకంగా బయలుదేరుతున్నాడు.. రోజూ తొలిజాముకే కూసే కోడి సైతం బుట్ట కిందకు చేరి.. ఇప్పుడు నావల్ల కాదని ముదురుకుంటోంది.. కిలకిలరావాలతో మానవాళిని మేల్కొలిపే పక్షులకు కూడా గొంతు పెగలడం లేదు.. మంచు కౌగిలి నుంచి బయట పడటానికి ప్రకృతి సైతం నీరొడుస్తోంది.. జనం ముసుగుతన్ని బయటకు రావడానికి జంకుతున్నారు..


– సాక్షి నెట్‌వర్క్



ఆస్పరి వద్ద పొగమంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు



ఆలూరు వద్ద ఉదయం ఏడు గంటలు దాటినా దర్శనమివ్వని సూర్యుడు



ఉదయం ఎనిమిది గంటల సమయంలో మద్దికెరలో వెలుగులోకి వచ్చిన భానుడు

బండి తీయని భానుడు!

తుపాను కారణంగా చలి తీవ్రత పెరిగింది. ముఖ్యంగా చలిగాలులు, పొగమంచు తీవ్రమైంది. సాయంత్రం ఐదు గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు కొనసాగుతున్నాయి. ఇక ఆరు దాటిన తరువాత చలి పెరుగుతోంది.



ఆలూరును కమ్మేసిన మంచు దుప్పటి



చిట్యాల సమీపంలో పొలాలపై కమ్మేసిన పొగమంచు



పొగమంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు